కొనసాగుతున్న ఎక్స్‌టెన్షన్ పనులు

- మూడు వంతెనల పనుల్లో జాప్యం
- 60 రోజుల్లో పూర్తి చేస్తామని ప్రకటన... కానీ ఇంత వరకు పూర్తి కాని పనులు
- ట్రాఫిక్‌తో చుక్కలు చూస్తున్న నగర వాసులు

నెహ్రూనగర్: నగరవాసులకు ట్రాఫిక్ కష్టాలు కొనసాగుతున్నాయి. మూడు వంతెనల వద్ద ట్రాక్ ఎక్స్‌టెన్షన్ పనులను రైల్వే అధికారులు సాగదీస్తున్నారు. రైల్వే ట్రాక్ ఎక్స్‌టెన్షన్ నిమిత్తం నవంబర్ 25వ తేదీ నుంచి మూడు వంతెనల మీదుగా రాకపోకలు నిలిపివేసిన విషయం తెలిసిందే. 60 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పిన అధికారులు ఇంత వరకు పనులు పూర్తి చేయకపోవడంతో నగర వాసులు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



మూడు వంతెనల వద్ద చేపట్టిన ట్రాక్ పనులు

ప్రస్తుతం రాకపోకలు..

మూడు వంతెనల వద్ద రాకపోకలు నిలిపివేయడంతో నగర ప్రజలు సంజీవయ్యనగర్, నెహ్రూనగర్ రైల్వేగేటు, శంకర్‌విలాస్ బ్రిడ్జి మీదుగా 1 టౌన్ నుంచి 2 టౌన్‌కి, 2 టౌన్ నుంచి 1 టౌన్‌కి రాకపోకలు సాగిస్తున్నారు. వేలాది వాహనాలు ఈ రహదారుల మీదుగా రాకపోకలు సాగించడంతో ట్రాఫిక్ చక్రబంధంలో నగర ప్రజలు గంటల కొద్ది రైల్వే గేటుల వద్ద ఇరుక్కుపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

10వ తేదీ నాటికి పూర్తి చేస్తామని..

రైల్వే ట్రాక్ ఎక్స్ టెన్షన్ పనులు చేపడుతున్న క్రమంలో మూడు వంతెనల కింద హెచ్‌ఎల్‌ఆర్ వెళ్లే వాటర్ పైపులైన్ జంక్షన్ ఉంది. ఈ పైపును మార్చాలని రైల్వే అధికారులు నగరపాలక సంస్థ అధికారులను కోరడంతో జీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు సదరు పైపులైన్ జంక్షన్ మార్చారు. ఈ క్రమంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మూడు వంతెనల వద్ద జరుగుతున్న పనులను గత కొద్ది రోజుల క్రితం పరిశీలించారు. ఇప్పటికే రెండు నెలలకు పైబడి నగర ప్రజలు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎట్టి పరిస్థితుల్లోను ఫిబ్రవరి 10వ తేదీ నాటికి పనులు పూర్తి చేసి మూడు వంతెనల మీదుగా రాకపోకలు సాగించే విధంగా చూడాలని రైల్వే అధికారులను ఆదేశించారు. కాని ఇంత వరకు పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడంలేదు.



సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన వాహనదారులు

కేంద్ర మంత్రితో చర్చించిన తరువాతే...

అరండల్‌పేట, బ్రాడీపేట, లక్ష్మీపురం, శ్రీనగర్ నుంచి మూడు వంతెనల మీదుగా రాకపోకలు సాగించే వారు సంజీవయ్యనగర్, నెహ్రూనగర్ రైల్వే గేటుల మీదుగా కొత్తపేట, ఆర్టీసీ బస్టాండ్, 1 టౌన్‌లోకి ప్రవేశిస్తున్నారు. అయితే ఈ రైల్వే గేటుల వద్ద ప్రతి ఐదు నిమిషాలకొకసారి రైల్వే గేటు పడటంతో వాహనదారులు గంటల కొద్ది రైల్వే గేటుల వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి. ఎటు చూసిన వాహనాలు రావడంతో... ద్విచక్రవాహనాలు వెళ్లడానికి కూడా చిన్న ఖాళీ కూడా లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొసారి ఒకే సారి మూడు రైళ్ల వెళ్లేంత వరకు గేటు తీయకపోవడంతో వాహనదారులు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. రైల్వే ట్రాక్ ఎక్స్‌టెన్షన్ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియజేయాలని సాక్షి ఓ రైల్వే అధికారిని వివరణ కోరగా సదరు అధికారి పనులు చివరి దశకు వచ్చాయని, కేంద్ర మంత్రి పెమ్మసానితో చర్చించిన తరువాత మూడువంతెనల మీదుగా వాహనాల రాకపోకలు సాగించేందుకు అనుమతిని ఇస్తామంటూ చెప్పుకొచ్చారు. దీనిని బట్టి చూస్తే నగర ప్రజలు ట్రాఫిక్‌లో అవస్థలు పడిన పర్వాలేదు కాని... కేంద్ర మంత్రి అనుమతి తరువాతనే ఏ నిర్ణయం అయిన తీసుకుంటామని చెప్పడం చూస్తుంటే రైల్వే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

25వ తేదీలోగా పూర్తి చేయిస్తాం

మూడు వంతెనల వద్ద చేపట్టిన పనులను నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, రైల్వే అధికారుల సమన్వయంతో పనులు వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే పైపులైన్ షిఫ్టింగ్ పనులు పూర్తి చేశాం. ఈ నెల 25వ తేదీలోగా రైల్వే పనులు పూర్తి చేస్తామని రైల్వే అధికారులు చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మూడు వంతెనల మీదుగా వాహనాల రాకపోకలు సాగించేందుకు చర్యలు తీసుకుంటాం.

– పులి శ్రీనివాసులు, నగర కమిషనర్

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు(గుంటూరు): విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్–2 ఈఈ ఎస్.గురవయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉండదని చెప్పారు. శ్యామలనగర్, పట్టాభిపురం, రవీంద్రనగర్, స్తంభాలగరువు ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జీకేఆర్ హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థుల వీడ్కోలు



గుంటూరు ఎడ్యుకేషన్: జీకేఆర్ హైస్కూల్ పట్టాభిపురం, ఏటీ అగ్రహారం క్యాంపస్‌లలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు వీడ్కోలు ఉత్సాహం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చిన్నపిల్లల వైద్య నిపుణుడు రఘురామ్ విద్యార్థులకు పరీక్షల వేళ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు హుషారు అయిన నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు జి.కొండారెడ్డి, జనార్దనరెడ్డి, ప్రిన్సిపాల్స్ శైలజ, సుశీల పాల్గొన్నారు.

వృద్ధులకు బియ్యం పంపిణీ



నగరంపాలెం: వృద్ధులను ఇతోధికంగా ఆదుకునేందుకు ముందుకు రావాలని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో ప్రతి నెల రెండో ఆదివారంలో భాగంగా వయోవృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, 11 రకాల నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోశాధికారి ఎస్‌వీ రమణ, సహాయ కార్యదర్శి పలకలూరి శివరావు, టి.మురళీసాయి, మామిడి శ్రావణి, పోలేపల్లి లహరి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: పీఎఫ్ ఆఫీస్ ముందు ద్విచక్ర వాహనం పెట్టి బయటకు వచ్చి చూసుకునేసరికి గుర్తులేని వ్యక్తులు వాహనం దొంగతనం చేసినట్లు బాధితులను ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీస్ స్టేషన్లో ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. అరండల్ పేట ప్రాంతానికి చెందిన వంగవీటి పద్మజ అనే మహిళ జనవరి 10వ తేదీన కృష్ణానగర్లోని పీఎఫ్ ఆఫీస్ వద్దకు ద్విచక్ర వాహనంపై వచ్చింది. పీఎఫ్ ఆఫీసులో పని పూర్తి చేసుకుని బయటికి వచ్చి చూసేసరికి ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో పరిశీలించి గుంటూరు బస్టాండు రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పరిశీలించగా ఎంతకు వాహనం కనిపించకపోవడంతో ఆదివారం బాధితురాలు పట్టాభిపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడు అదృశ్యం



లక్ష్మీపురం: పనికి వెళ్లి ఇంటికి వచ్చి బయటికి వెళ్లిన వృద్ధుడు శనివారం రాత్రి చోటుచేసుకుంది నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రకారం ఏటీ అగ్రహారం 17వ లైన్‌కి చెందిన పడిగపాటి వెంకటేశ్వర రెడ్డి (60) పట్నం బజార్లో ముఠామేస్త్రిగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉంటాడు. గత కొద్ది కాలంగా ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో మనస్తాపనకు లోనవుతున్నాడు. అయితే శనివారం ఉదయం పనికి వెళ్లి రాత్రి 9 గంటలకు ఇంటికి తిరిగి వచ్చి బయటకు వెళ్లిన వ్యక్తి మళ్లీ తిరిగి రాలేదు. చుట్టుపక్కల వారిని కుటుంబ సభ్యులు విచారించగా ఎంతకు జరా తొలగిపోవడంతో కుమారుడు పడిగపాటి సుబ్బారామిరెడ్డి నగరంపాలెం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనుల పండువగా స్వామి వార్ల కల్యాణోత్సవం



నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/13వ అడ్డ రోడ్డు ఓంకార క్షేత్రం కుర్తాళం శ్రీసిద్ధేశ్వరీ పీఠపాలిత ఓంకార క్షేత్రంలో నిర్వస్తున్న 91వ శ్రీరామ నామ సప్తాహ మహోత్సవం- 95వ సంఘ వార్షికోత్సవాలలో భాగంగా ఆదివారం ఏడో రోజుకి చేరాయి. ఉదయం క్షేత్రపాలక ఆంజనేయ స్వామికి మృత్యుంజయ సహిత ఆదిత్యాది నవగ్రహ దేవతలకు వేదోక్తంగా అభిషేకార్చనలు నిర్వహించారు. గోదాదేవి సమేత రంగనాయక స్వామి వార్లకు, సువర్చలా సమేత ఆంజనేయ స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలు విశేష హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఎం.వెంకటసత్యవతి, శ్రీమద్ రామాయణ ప్రవచనంలో యుద్ధకాండలోని అంశాలను వివరించారు. కార్యదర్శి నంబూరు వేంకటశ్రీమన్నారాయణమూర్తి పాల్గొన్నారు.

ముగిసిన కాసరనేని కళా సమితి నాటకోత్సవాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం ఆవరణలోని అన్నమయ్య కళా వేదికపై కె.ఆర్.కె. ఈవెంట్స్ నిర్వహణలో నిర్వహిస్తోన్న డాక్టర్ కాసరనేని సదాశివరావు కళాసమితి 13వ నాటకోత్సవాలు ఆదివారం ముగిశాయి. తొలుత ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరు నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో నాటకోత్సవాలను ప్రారంభించారు. ఎల్‌వీఆర్ క్రియేషన్స్(గుంటూరు) ఆధ్వర్యంలో బత్తినేని సుభాష్ రచన దర్శకత్వం వహించిన హాస్యవల్లరి నవ్వుల్తో ముంచెత్తింది. హేలాపురి కల్చరల్ అసోసియేషన్(ఏలూరు) ఆధ్వర్యంలో చింతల మల్లేశ్వరరావు రచనకు మహమ్మద్ ఖాజావలి దర్శకత్వం వహించిన సారీ... రాంగ్ నెంబర్ నాటికను, శ్రీకరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ (గుంటూరు) ఆధ్వర్యంలో బొమ్మిడి రామకృష్ణ రచన, దర్శకత్వం వహించిన తర మెల్లిపోతున్నదో నాటికలు ప్రదర్శించారు. ఆయా నాటికలు ప్రేక్షకులను అమాంతం ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను సంస్థ కన్వీనర్ కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్ పర్యవేక్షించారు.

నగరాభివృద్ధిలో భాగస్వాములమవుదాం

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

లక్ష్మీపురం: ప్రజా సమస్యలను క్షేత్రస్థాయి నుంచి పరిష్కరించి, నగర అభివృద్ధికి సంపూర్ణ ప్రణాళికలను శ్రీకారం చుట్టబోతున్నాం అని కేంద్ర సహాయ గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. స్థానిక భారతీయ విద్యా భవన్‌లో ఆదివారం స్వచ్ఛంద సంస్థల సమావేశాన్ని భారతీయ విద్యా భవన్ కార్యదర్శి పి.రామచంద్ర రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరాన్ని స్మార్ట్ సిటీగా రూపొందించేందుకు ప్రతి ఒక్కరి సలహాలు సూచనలు అవసరమని పేర్కొన్నారు. గుంటూరులోని పార్కులు, ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల వసతి గృహాలను స్వచ్ఛంద సేవా సంస్థలు, కార్పొరేట్ సంస్థలు దత్తత తీసుకొని వాటి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం సహకారంతో నగరంలో మూడు ఫ్లైఓవర్ నిర్మాణానికి అనుమతులు పొందామని, తదుపరి ఆర్థిక సంవత్సరంలో శ్యామల నగర్ రైల్వే వంతెనను చేపట్టనున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అతిపెద్దదైన గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలను కార్పొరేట్ ఆస్పత్రులతో సమానంగా తీర్చిదిద్దనున్నామని తెలిపారు. అన్ని రంగాల్లో గుంటూరు నగరాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి రెడ్ క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్ వంటి స్వచ్ఛంద సేవా సంస్థల సహకారం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. కార్యక్రమానికి రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ రవి వడ్లమాని, జీజీహెచ్ సూపరింటెంటెంట్ డాక్టర్ రమణా యశస్వి, సాహితీ సమాఖ్య కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల అధినేత మట్టుపల్లి మోహన్, ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఆవుల శ్రీనివాస్, గుంటూరు సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు నూతలపాటి తిరుపతయ్య, ప్రముఖ వైద్యులు మన్నవ రాధాకృష్ణ మూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

అనధికార మాంసం విక్రయాలు జరిపితే చర్యలు



నెహ్రూనగర్: ప్రజారోగ్యం దృష్ట్యా నగరంలో అనధికార చేపలు, మాంసం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంహెచ్‌ఓ డాక్టర్ రవి బాబుహెచ్చరించారు. ఆదివారం కమిషనర్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు బృందాలుగా ఏర్పడి నగరంలోని మణిపురం బ్రిడ్జ్ క్రింద చేపల మార్కెట్, నల్లపాడు రోడ్డు, రెడ్డి కాలేజీ రోడ్డు, మిర్చియార్డ్, నవభారత నగర్, గోరంట్ల, ఆర్.టి.ఓ. ఆఫీసు, గుజ్జనగుండ్ల, అమరావతి రోడ్డు, పొన్నూరు రోడ్డు, పట్టాభిపురం ప్రాంతాలలో రోడ్లపై అనధికారికంగా చేపలు, మాంసం విక్రయిస్తున్న వారిని గుర్తించి వారిపై దాడులు నిర్వహించి వాటిని తొలగించి, వారి వద్ద నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ సందర్భంగా ఎంహెచ్ డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ నగర పరిధిలో ఎక్కడైనా అనధికారికంగా నాటుకోళ్లు, చేపలు, మాంసం విక్రయాలు జరిపై వారిపై కఠిన చర్యలు, భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించడమే కాకుండా వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్ పొంది మాంసం విక్రయించే షాపుల యజమానులు తమ షాపు చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మాంసంపై దుమ్ము, ధూళి పడకుండా మెస్‌లను కట్టి ఎప్పటికప్పుడు శుభ్రత పాటించాలని వివరించారు. శుభ్రత పాటించని షాపులపై ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశు వైద్యుడు వెంకటేశ్వర్లు, ఎస్ఎస్‌లు ఆనందకుమార్, సోమశేఖర్, రాంబాబు, అయూబ్ ఖాన్ పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళలను ప్రోత్సహించాలి



కళాకారులతో నిర్వాహకులు

నగరంపాలెం: స్థానిక మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శ్రీ మంజునాథ నాట్య క్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ స్థాయి నృత్య సంగీతం, కళా ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఒక వేదికపై పలువురు నృత్యాల ప్రదర్శన అట్టహాసంగా జరిగాయి. కొందరు చిన్నారుల నృత్యాలు సభికులను అలరించాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన మలినేని కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్ల మాట్లాడుతూ దేశ సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే నృత్యాలే మన భారతీయమని అన్నారు. కళ జీవించాలంటే అందరి ప్రోత్సాహం అవసరమని చెప్పారు. కళాకారుడు కావడం చాలా కష్టమని, కళాకారునిగా జన్మించడం అదృష్టమని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతిక, సంప్రదాయ, కళలను ప్రోత్సహిస్తూ, జీవం పోస్తున్న రాజుపాలెం మనోజ్ఞ, ప్రదీప్‌లను అభినందించారు. నృత్య ప్రదర్శనలు చేసి, ఉత్తమ నైపుణ్యం ప్రదర్శించిన కళాకారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ టి.పవన్ కుమార్, జంపని కిషోర్‌బాబు, డాక్టర్ డి.నాగమల్లీశ్వరి, విజయమాధవి, డాక్టర్ ఆకుల శివప్రసాద్, డాక్టర్ ఎస్.అనిత పాల్గొన్నారు.

బైక్‌లతో యువకుల హంగామా

పట్నంబజారు: గుంటూరు నగరంలో మరో సారి యువకులు హల్‌చల్ చేశారు. బైక్‌లపై విన్యాసాలు చేస్తూ.. భారీగా శబ్దాలతో కూడిన హారన్‌లు కొడుతూ.. హడావుడి చేశారు. భారీ హారన్‌లు, స్నేక్ డ్రైవ్‌లతో బీభత్సం చేయటంతో వాహనదారులతో పాటు, పాదచారులు భయాందోళనలకు గురైన పరిస్థితులు ఉన్నాయి. గుంటూరు అరండల్‌పేట, పట్టాభిపురం, వెస్ట్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో కళాశాలలు అధికంగా ఉన్న విషయం విదితమే. ఈ క్రమంలో నిత్యం సాయంత్రం వేళల్లో ప్రమాదకర డ్రైవింగ్ చేస్తూనే ఉన్నారు. త్రిపుల్ రైడింగ్‌తో ఆదివారం సాయంత్రం జరిగిన హడావుడికి ప్రజలు భయభ్రాంతులు అయ్యారు. లక్ష్మీపురం ప్రధాన రహదారి, కొరిటిపాడు మెయిన్ రోడ్డులో సుమారు 15 బైక్‌లతో త్రిపుల్ రైడింగ్ చేస్తూ.. ర్యాష్, అండ్ స్నేక్ డ్రైవ్ చేశారు. నిత్యం కేసులు నమోదు చేస్తున్నామని అధికారులు చెప్పినా ఎటువంటి ప్రయోజనం కనపడటంలేదు. అసలు స్పెషల్ డ్రైవ్‌ల ఊసే లేదని, మైనర్‌లు వాహనాలు నడుపుతున్నా.. కట్టడి చేయటంతో ట్రాఫిక్ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. ఇప్పటికైనా దృష్టి సారించి ర్యాష్ అండ్ స్నేక్ డ్రైవ్‌ను అరికట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.



భారీ బైక్ హారన్‌లతో ప్రమాదకర డ్రైవింగ్ చేస్తున్న యువత, విద్యార్థులు

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

లక్ష్మీపురం: క్యాన్సర్ వచ్చిన కాపాడే బతికించడంతో వారి జీవితకాలం కొంత పొడిగించగలిగే స్థితికి ప్రస్తుతం వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయని ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు రాజు నాయుడు తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్యం అందుబాటులోకి వచ్చినా అప్రమత్తంగా ఉండకపోతే కష్టమని పేర్కొన్నారు. కొన్ని రకాల క్యాన్సర్‌కు వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గర్భసంచి వ్యాక్సిన్ ఆడపిల్లలకు 9 నుంచి 14 సంవత్సరాల లోపు చేస్తే మంచిదన్నారు. అనంతరం డాక్టర్ రాజు నాయుడును ఘనంగా సత్కరించారు. సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, అవగాహన సంస్థ సీనియర్ సభ్యులు ఎస్.విద్యాధర కుమార్, టెలికాం శాఖ విశ్రాంత అధికారి బి.సాంబశివరావు, ఎ.హరి, చల్లా అంజిరెడ్డి, ఆర్.రామచంద్రరావు పాల్గొన్నారు.

నేషనల్ స్కూల్ గేమ్స్‌కు మైత్రి ఎంపిక



లక్ష్మీపురం: అంతర్ జిల్లాల సాఫ్ట్ టెన్నిస్ అంతర్ జిల్లా పోటీలలో కొత్తరెడ్డిపాలేనికి చెందిన కుందన మైత్రి ప్రథమ బహుమతి దక్కించుకుంది. ఈనెల 8 9 తేదీలలో కర్నూలు జిల్లాలో అంతర్ జిల్లాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గుంటూరు జిల్లా బాలికల జట్టుకు ప్రథమ స్థానం, బాలుర జట్టు ద్వితీయ స్థానం లభించింది. బాలికల జట్టులోని కుందన మైత్రి ప్రథమ స్థానం దక్కించుకుంది. మార్చి 17 నుంచి 22వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని లుధియానాలో నిర్వహించనున్న నేషనల్ స్కూల్ గేమ్స్‌కు ఎంపిక అయింది.

డాక్టర్ విజయకుమార్‌కు గోల్డ్ మెడల్

గుంటూరు మెడికల్: మూడు దశాబ్దాల క్రితం గుంటూరు నగరంలో మధుమేహ వ్యాధి ఆస్పత్రిని స్థాపించి వేలాది మందికి వైద్య సేవలు డాక్టర్ వీవీ రామ్‌కుమార్ అందిస్తున్నారని గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి పేర్కొన్నారు. మధుమేహ వైద్యంలో విశేష సేవలందిస్తున్న డాక్టర్ జి.విజయ్ కుమార్‌కు వి.శేషయ్య గోల్డ్ మెడల్‌ను ఆదివారం అందించి, సత్కరించారు. స్థానిక రాజేంద్రనగర్ హోటల్ క్యాపిటల్‌లో ఎస్వీఆర్ షుగర్ హాస్పిటల్, డాక్టర్ వీవీ రామ్ కుమార్ డయాబెటిస్ అకాడమీ అండ్ స్మైల్ డయాబెటిస్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన షుగర్ వ్యాధి నిపుణులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ ముఖ్య అతిథులుగా హాజరై సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ మాట్లాడుతూ డాక్టర్ రామ్‌కుమార్ ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులు గానే కాకుండా నగరంలోని వైద్యులందరికీ తన లాఫ్టర్ క్లబ్ ద్వారా నెల నెల హాస్య కార్యక్రమాలతో మానసిక ఆనందాన్ని, ఆహ్లాదాన్ని పంచుతున్నారని అభినందించారు. డాక్టర్ వి.వి.రామ్ కుమార్ మాట్లాడుతూ షుగర్ వ్యాధిపై వివిధ అంశాల ద్వారా వివిధ రాష్ట్రాల నుంచి అంతర్జాతీయ వైద్యులు వర్క్‌షాప్ ద్వారా సీనియర్, జూనియర్ డాక్టర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా దిశా నిర్దేశం చేశారని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వి.కమలా రామ్ కుమార్, భవతరణి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ సుందరాచారి, పక్కన డాక్టర్ రమణ తదితరులు

దక్షిణ భారత హిందీ ప్రచారసభ పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: సీతారామ్‌నగర్‌లోని శ్రీసరస్వతీ కమిటీ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో పరిచయ, ప్రాథమిక, మాధ్యమ పరీక్షలను నిర్వహించారు. 56 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు పాఠశాల కరస్పాండెంట్ డీవీ సుబ్బారావు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మానస వీణ చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరించగా, ఉపాధ్యాయులు అరుణకుమారి, నాగమేరీ, విజయలక్ష్మి ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు.

16 కేసులు నమోదు

పట్నంబజార్: విల్ లాకింగ్ సిస్టమ్ ద్వారా ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. గుంటూరు నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధలకు విరుద్ధంగా నో పార్కింగ్ చేసిన వాహనాలకు విల్ లాకింగ్ సిస్టమ్ ద్వారా అపరాధ రుసుం విధించారు. గుంటూరు ఈస్ట్, వెస్ట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 16 కేసులు నమోదు చేసి రూ.16,600 వరకు జరిమానాలు విధించారు. నిబంధనలకు విరూద్ధంగా వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతి ఒక్కరూ దంతాలపై శ్రద్ధ పెట్టాలి



మాట్లాడుతున్న డాక్టర్ చల్లా చైతన్య

గుంటూరు మెడికల్: నోరు అనేక రకాల హానికర సూక్ష్మజీవులకు నిలయమని నోరు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోకపోతే, నోటి దుర్వాసన ,పుండ్లు పడడం, చిగుళ్ల వాపు, దంతాలు ఊడటం వంటి సమస్యలు తలెత్తుతాయని కాస్మోడెంటిస్ట్ దంత వైద్యశాల దంత శస్త్ర చికిత్స నిపుణులు చల్లా చైతన్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేట లోని ఎస్ హెచ్ ఓ భవనంలో ఎస్ హెచ్ ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన 'ఉచిత దంత వైద్య శిబిరం, శాస్త్రీయ అవగాహన సభ 'లో డాక్టర్ చైతన్య పాల్గొని ప్రసంగించారు. సభకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ వయసు పెరిగిన కొద్దీ వయసుతో పాటే పళ్ళు ఊడిపోతాయనే భావన చాలామందిలో ఉందని, అయితే తగిన ముందు జాగ్రత్తలు తీసుకుంటే వయసుతోపాటు పళ్లు ఊడడాన్ని నిరోధించవచ్చునన్నారు. నోటిలో దాదాపు 200 నుంచి 300 రకాల సూక్ష్మ జీవులు 10 మిలియన్ల దాకా ఉంటాయన్నారు. అవి ఎప్పుడు మనం తినే ఆహార పదార్థాల్లోని పిండి పదార్థాలను ,చక్కెరలను వినియోగించుకుంటూ, వృద్ధి చెంది నోటి దుర్వాసనకు, దంత క్షయానికి కారణమవుతాయన్నారు. మనం నిద్రపోయే సమయంలో మరింతగా సూక్ష్మజీవులు వద్ధి చెందుతాయన్నారు. అందువల్ల నోటిని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ నోటి ఆరోగ్యంతోపాటు, శరీర ఆరోగ్యం కూడా కాపాడుకోవాలన్నారు. వైద్య శిబిరంలో ఎస్‌హెచ్‌ఓ మేనేజర్ పి.నిర్మలరాణి, మేకల రామారావు, చావా శివాజీ పాల్గొన్నారు.

19న వాహనాల వేలం

పట్నంబజారు: పన్నులు చెల్లించకుండా రవాణాశాఖ దాడుల్లో పట్టుపడిన వాహనాలకు ఈ నెల 19వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు డీటీసీ కె. సీతారామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు ఆర్టీఏ కార్యాలయంలో ఉన్న 31 వాహనాలకు సంబంధించి ఎల్‌జీవీలు, మోటార్ సైకిల్స్, మోటార్‌కార్, మ్యాక్సీక్యాబ్లు వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత వాహనదారులు పన్నులు, కట్టాల్సిన అపరాధ రుసుం చెల్లించి ఫిబ్రవరి 18వ తేదీలోగా వాహనాలను విడిపించుకోవాలని లేని పక్షంలో 19వ తేదీన వేలంపాట నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. 19వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు స్వర్ణభారతినగర్‌లోని ఆర్టీఓ కార్యాలయంలో వేలం జరుగుతుందని వివరించారు.